క్లుప్తంగా

బీజేపీ మండల అధ్యక్షుడిగా సుబ్రహ్మణ్యం



బొరుసు సుబ్రహ్మణ్యాన్ని అభినందిస్తున్న నాయకులు

కడియం: బీజేపీ మండల అధ్యక్షుడిగా బొరుసు సుబ్రహ్మణం ఎన్నికైనట్లు రిటర్నింగ్ అధికారి, జిల్లా ఉపాధ్యక్షుడు కరుటూరి శ్రీనివాసరావు తెలిపారు. బుర్రిలంకలో బుధవారం జరిగిన పార్టీ అంతర్గత ఎన్నికల్లో భాగంగా నూతన అధ్యక్షుడిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆకుల శ్రీధర్ మాట్లాడుతూ కూటమి నాయకులను కలుపుకొని పార్టీ బలోపేతానికి సుబ్రహ్మణ్యం కృషి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

సీటీఆర్ఐ: నగరంలోని ముగ్గురు లబ్ధిదారులకు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.2.40 లక్షల చెక్కులను బుధవారం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పంపిణీ చేశారు. తిలక్ రోడ్డులోని ఆయన కార్యాలయం వద్ద ఈ కార్యక్రమం జరిగింది.

గేమ్ చేంజర్ ఈవెంట్ పనులకు శ్రీకారం



ఈవెంట్ పనుల ప్రారంభం సందర్భంగా పూజలు చేస్తున్న ఏడిద బాబీ తదితరులు

కడియం: దర్శకుడు శంకర్ దర్శకత్వంలో రూపుదిద్దుకున్న గేమ్ చేంజర్ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ ఈ నెల నాలుగో తేదీన వేమగిరిలో జరగనుంది. ఈ కార్యక్రమ పనులను బుధవారం రాష్ట్ర చిరంజీవి యువత ప్రధాన కార్యదర్శి ఏడిద బాబీ, మెగా అభిమానులు శ్రీకారం చుట్టారు. గేమ్ చేంజర్ సినిమాను జిల్లా పరిసర ప్రాంతాల్లోనే అధికంగా చిత్రీకరించారు. అంతేగాక గ్రామీణ ప్రాంతంలో ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించడానికి చిత్ర యూనిట్ నిర్ణయించుకున్నట్లు తెలుస్తుంది. ఈ కార్యక్రమానికి హీరో రామ్ చరణ్, దర్శకుడు శంకర్‌తో పాటు మెగాస్టార్ చిరంజీవి, డిప్యూటీ సీఎం పవన్, చిత్ర యూనిట్, సినీ రాజకీయ ప్రముఖులు, మెగా ఫ్యామిలీ విచ్చేస్తున్నట్లు సమాచారం.

వృద్ధులను ప్రేమతో ఆదరించాలి



వృద్ధులకు చీరలు పంపిణీ చేస్తున్న గుబ్బల రాంబాబు

రాజమహేంద్రవరం సిటీ: వృద్ధులను ఆదరించలేని కుటుంబ సభ్యులు వారిని రోడ్డున పడేయకుండా స్వర్ణాంధ్ర ఆశ్రమానికి అప్పగించాలని నిర్వాహకుడు డాక్టర్ గుబ్బల రాంబాబు విజ్ఞప్తి చేశారు. ఆ ఆశ్రమంలో బుధవారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలుత వృద్ధులతో కేక్ కట్ చేయించారు. వారికి పండ్లు, చీరలు, కాస్మెటిక్స్ పంపిణీ చేశారు. రాంబాబు మాట్లాడుతూ 27 ఏళ్లగా వృద్ధుల సంరక్షణకు కృషి చేస్తున్నామన్నారు. కుటుంబ తగాదాలతో ఇల్లు వదిలి వచ్చేసిన అనేక మంది వృద్ధులను చేరదీసి ఆదరించామని, వారిలో కొందరిని వారి కుటుంబాలకు వద్దకు చేర్చామన్నారు. కార్యక్రమంలో హెల్పింగ్ హ్యాండ్స్ అడ్మిన్ అనూప్ కుమార్ జైన్, బాలాజీ, ప్రసాద్, హరికృష్ణ పాల్గొన్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడు -2గా నాగబాబు



నాగబాబును అభినందిస్తున్న బీజేపీ నాయకులు

రాజమహేంద్రవరం రూరల్: బీజేపీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా పార్టీ రూరల్ మండల రెండో అధ్యక్షుడిగా కవలగొయ్యికి చెందిన మట్టా నాగబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలంలోని బీజేపీ బూత్ అధ్యక్షులు, క్రియాశీలక సభ్యుల ఏకాభిప్రాయంతో మండల రిటర్నింగ్ అధికారి కాలెపు సత్యసాయిరామ్ సమక్షంలో బుధవారం నాగబాబును ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పూర్వపు అధ్యక్షుడు ఎన్‌వీబీ ఆచారి, రాష్ట్ర నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ యానాపు ఏసు, పన్నాల వెంకటలక్ష్మి, సంతోషి, గుర్రాల వెంకటరావు, తనుబుద్ధి సూర్యభాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

మరమ్మతులకు మోక్షమెప్పుడో!

- ధవళేశ్వరం పంచాయతీ అధికారుల విచిత్ర ధోరణి
- మూలకు చేరిన ట్రాక్టర్లు
- మరమ్మతులు చేయించని వైనం
- అద్దె ట్రాక్టర్‌తో పారిశుధ్య నిర్వహణ



ధవళేశ్వరం సచివాలయం

ధవళేశ్వరం: సొంత పారిశుధ్య వాహనాలకు కనీసం టైర్లు వేయించలేని దుస్థితిలో ధవళేశ్వరం పంచాయతీ కొట్టుమిట్టాడుతోంది. విచిత్రంగా అద్దె వాహనాలకు మాత్రం ప్రతి నెలా డబ్బులు చెల్లిస్తోంది. వివరాల్లోకి వెళితే.. ధవళేశ్వరం పంచాయతీకి సొంతంగా 8 పారిశుధ్య ట్రాక్టర్లు ఉన్నాయి. ప్రస్తుతం వీటిలో ఆరు ట్రాక్టర్లు పనిచేస్తున్నాయి. మిగిలిన రెండూ మరమ్మతులకు గురయ్యాయి. వాటిలో ఒక ట్రాక్టర్‌కు టైర్లు వేయిస్తే సరిపోతుంది. కానీ ఆ దిశగా పంచాయతీ అధికారులు దృష్టి సారించలేదు. మరో ట్రాక్టర్ మరమ్మతులు చేయించేందుకు ఎక్కువ సొమ్ము ఖర్చు అవుతుందని వదిలేశారు. ఈ రెండు వాహనాలు ధవళేశ్వరం పంచాయతీ కార్యాలయం వద్ద ఒక మూలన పడి ఉన్నాయి. విచిత్రంగా సొంత వాహనాలకు మరమ్మత్తులు చేయించలేని పంచాయతీ అధికారులు నెలకు రూ.30 వేలు అద్దె చెల్లించి ఓ ట్రాక్టర్‌ను అద్దెకు తీసుకున్నారు.

అంతంత మాత్రమే

రాష్ట్రంలోనే మేజర్ పంచాయతీ అయిన ధవళేశ్వరంలో సుమారు 60 వేల మంది జనాభా ఉన్నారు. గత పదేళ్లతో పోల్చితే గ్రామంలోని శివారు ప్రాంతాల్లో నివాస గృహాలు పెరిగాయి. కానీ ఆ స్థాయిలో పారిశుధ్య కార్మికులు, వాహనాలు లేవు. దీంతో పారిశుధ్య నిర్వహణ గాడి తప్పిందని చెప్పవచ్చు. అలాగే గతంలో ఉన్న బ్యాటరీ వాహనాలు, రిక్షాలు మరమ్మతులకు రావడంతో వాటిని మూలన పడేశారు. దీంతో ప్రస్తుతం పంచాయతీకి చెందిన ఆరు ట్రాక్టర్లు, అద్దెకు తీసుకున్న ఒక ట్రాక్టర్‌తో పారిశుధ్య నిర్వహణ చేపడుతున్నారు. మరమ్మతుకు వచ్చిన రెండు వాహనాలకు సుమారు రెండు నుంచి మూడు లక్షల రూపాయలు వెచ్చిస్తే సరిపోతుందని పంచాయతీ సిబ్బంది చెబుతున్నారు. కానీ ఆ దిశగా అధికారులు దృష్టి సారించకపోవడం ప్రధాన సమస్యగా మారింది. ప్రస్తుతం మరమ్మతులో ఉన్న రెండు వాహనాలకు రిపేరు చేయించి పారిశుధ్య నిర్వహణకు వినియోగిస్తే గ్రామంలో పారిశుధ్య నిర్వహణను గాడిన పెట్టవచ్చని పలువురు సూచిస్తున్నారు.

నిర్వహణకు నిధులు లేవా?

ధవళేశ్వరం పంచాయతీకి సంబంధించి కనీసం నిర్వహణ పనులు చేపట్టేందుకు కూడా నిధులు లేని పరిస్థితి ఉందా అన్నది ప్రస్తుతం పలువురిని వేధిస్తున్న ప్రశ్న. సుమారు 60 వేల జనాభా కలిగిన ధవళేశ్వరంలో పన్నుల రూపంలో ఏటా రూ.4 కోట్ల వరకూ ఆదాయం వస్తుందని అధికారులు చెబుతున్నారు. కనీసం పారిశుధ్య వాహనాలకు మరమ్మతులు చేయించలేకపోవడం, పాడైపోయిన చెత్త కుండీల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయించకపోవడం, పారిశుధ్య కార్మికులకు సక్రమంగా జీతాలు ఇవ్వలేకపోవడం తదితర సమస్యలు ఎందుకు తలెత్తుతున్నాయన్నది అంతు చిక్కని ప్రశ్నగా మిగిలింది. ధవళేశ్వరం పంచాయతీలో విధులు నిర్వర్తించేందుకు తాత్కాలిక పారిశుధ్య సిబ్బంది సుముఖత చూపడం లేదు. సమయానికి జీతాలు ఇవ్వలేకపోవడమే దీనికి ప్రధాన కారణమని తెలుస్తోంది. దీంతో గ్రామంలో పూర్తి స్థాయిలో పారిశుధ్య నిర్వహణ పనులు చేపట్టలేని పరిస్థితి నెలకొంది.

> **అంచనాలు తయారు చేస్తున్నాం**
>
> మరమ్మతుకు వచ్చిన వాహనాలకు సంబంధించి అంచనాలు తయారు చేయిస్తున్నాం. వాటిని బాగు చేయించి, పారిశుధ్య నిర్వహణకు వినియోగిస్తాం. ఒక వాహనానికి టైర్లు, మరో వాహనానికి మరమ్మతులు చేయించాల్సి ఉంది.
>
> – వెంకట్రావు, గ్రామ కార్యదర్శి



మరమ్మతులకు రావడంతో మూలకు చేరిన పారిశుధ్య ట్రాక్టర్



టైర్లు పాడవడంతో మూలన పడిన ట్రాక్టర్



బ్యాటరీ వాహనాల దుస్థితి



మరమ్మతులకు నోచుకోని రిక్షాలు

యూటీఎఫ్ మహాసభల ప్రచార ర్యాలీ



రాజమహేంద్రవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

కంబాలచెరువు: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) స్వర్ణోత్సవ మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ జిల్లా శాఖ ఆధ్వర్యంలో బుధవారం ప్రచార ర్యాలీ నిర్వహించారు. స్థానిక కంబాలచెరువు సెంటర్ వద్ద రాష్ట్ర కార్యదర్శి ఎస్.అరుణకుమారి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. కంబాల చెరువు నుంచి డీలక్స్ సెంటర్ మీదుగా నందం గనిరాజు జంక్షన్ వరకూ ప్రదర్శన కొనసాగింది. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.షరీఫ్ మాట్లాడుతూ స్వర్ణోత్సవ మహాసభలు విజయవంతం కావడానికి ఈ ర్యాలీ నిర్వహించినట్టు చెప్పారు. యూటీఎఫ్ ఆవిర్భవించినప్పటి నుంచి ఉపాధ్యాయుల హక్కుల సాధనకు అనేక పోరాటాలు చేసిందన్నారు. కార్యక్రమంలో సహాధ్యక్షురాలు ఎం.విజయ, కోశాధికారి ఈవీఎస్ఆర్ ప్రసాద్, జిల్లా కార్యదర్శులు ఎన్.రవిబాబు, కె.రమేష్‌బాబు, చిలుకూరి శ్రీనివాసరావు, ఇ.శ్రీమణి పాల్గొన్నారు.

ఆకతాయిల వీరంగం

- ముగ్గులు పెడుతున్న మహిళలతో అసభ్య ప్రవర్తన
- ప్రశ్నించిన వారిపై దాడి
- ఘటనా స్థలానికి వచ్చిన పోలీసులకూ స్వల్ప గాయాలు

సీతానగరం: కొన్ని గంటల్లో నూతన సంవత్సరం రాబోతోంది. దానికి ఘనంగా స్వాగతం పలికేందుకు మహిళలు తమ ఇళ్ల ముందు ఉత్సాహంగా ముగ్గులు పెడుతున్నారు. ఆ సమయంలో వచ్చిన ఆకతాయిలు వారితో అసభ్యంగా ప్రవర్తించారు. అడ్డుకున్న వారిపైనా, ఘటనా స్థలానికి వచ్చిన పోలీసులపైనా దాడి చేశారు. వెదుళ్లపల్లి పంచాయతీ పరిధిలోని రాజంపేటలో మంగళవారం అర్ధరాత్రి ఈ ఘటన జరిగింది. సీతానగరం ఎస్సై డి.రామ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. రాజంపేట బీసీ కాలనీలో మంగళవారం రాత్రి సుమారు 11 గంటల సమయంలో మహిళలు నూతన సంవత్సరం సందర్భంగా ముగ్గులు పెడుతున్నారు. ఆ సమయంలో కాటవరానికి చెందిన గాడ దుర్గాప్రసాద్ మరో వ్యక్తితో కలిసి అక్కడకు వచ్చాడు. ముగ్గులు పెడుతున్న మహిళల వద్దకు వచ్చి, బైక్ గేర్ మార్చకుండా ఎక్స్‌లేటర్‌ను పెంచుతూ, గట్టి శబ్దం వచ్చేలా హడావుడి చేశాడు. ఆ మహిళలను అసభ్య పదజాలంతో దూషించాడు. అక్కడే ఉన్న దాసరి రాము, అతడి బావమరిది అప్పలరాజు ఆ ఆకతాయిలను అడ్డుకున్నారు. దీంతో దుర్గాప్రసాద్ తన స్నేహితులకు ఫోన్ చేసి విషయం చెప్పాడు. వెంటనే ముగ్గళ్ల, కాటవరం నుంచి రాళ్లు, కర్రలతో కొందరు యువకులు వచ్చేశారు. మహిళలతో అసభ్యంగా ప్రవర్తించడమే కాకుండా దాసరి రాము, అప్పలరాజును గాయపరిచారు. విషయం తెలుసుకున్న కోరుకొండ సీఐ సత్య కిషోర్, ఎస్సై రామ్ కుమార్, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఇంతలో ఆకతాయిలు రాళ్లు రువ్వడంతో ఎస్సై రామ్ కుమార్, కానిస్టేబుళ్లు వినోద్ కుమార్, రమేష్, షరీఫ్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

ఆకతాయిల్లో మద్యం మత్తులో ఉన్న ఓ యువకుడు సీసా బద్దలు కొట్టి, గొంతు కోసుకుంటానని సీఐను బెదిరించాడు. ఆయన రివాల్వర్ తీసి గట్టిగా హెచ్చరించడంతో అక్కడి నుంచి పరారయ్యాడు. కాగా.. ఆకతాయిల దాడిలో గాయపడిన ఇద్దరినీ రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. దాడికి పాల్పడిన దుర్గాప్రసాద్, హర్ష, సిద్ధు, గాడ వెంకటేష్, జయసూర్య, వినయ్, మనోజ్‌తో పాటుగా మరి కొందరిపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు.

దైవ నామస్మరణతో బాధలు దూరం



సత్యసాయి నామసంకీర్తనలో మాట్లాడుతున్న బులుసు వెంకటేశ్వర్లు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): కలియుగంలో దైవ నామస్మరణతో బాధలు దూరమవుతాయని సత్యసాయి సేవాసంస్థల జిల్లా అధ్యక్షుడు బులుసు వెంకటేశ్వర్లు అన్నారు. రాజమహేంద్రవరంలోని సేవా కేంద్రంలో బుధవారం విభూతి వైష్ణవ్.. సత్యసాయి నామ సంకీర్తన ఆలపించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాల ఆధ్యాత్మిక కార్యక్రమంలో భాగంగా నూతన ఆంగ్ల సంవత్సర మొదటి రోజున ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. విద్యానగర్ సేవా సమితి కన్వీనర్ కేఎస్వీ సత్యనారాయణ, ధర్మారావు దంపతులు జ్యోతి ప్రజ్వలన, అష్టోత్తర పూజ చేశారు. సత్యసాయి గురుకులం కరస్పాండెంట్ అయోధ్యుల శ్యాంసుందర్, జిల్లా ఆధ్యాత్మిక సమన్వయకర్త ఎన్వీ సాయిరాం మాట్లాడారు. జిల్లా వేదాధ్యయన సమన్వయకర్తలుగా కందర్ప సాయి సుబ్రహ్మణ్య శ్రీరాంశర్మ, గాయత్రి, జిల్లా ఐటీ ఇన్‌చార్జిగా పోతుల ఈశ్వరరావును నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు నియామక పత్రాలను అందించారు.

ఘనంగా గజేంద్రుడి విగ్రహ ప్రతిష్ఠ

బిక్కవోలు: మండలంలోని బలభద్రపురం గ్రామంలో ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో గజేంద్రుని విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. బుధవారం ఆలయం వద్ద గజేంద్రుని దాదాపు రూ.2.5 లక్షలతో ఇదే గ్రామానికి చెందిన ద్వారంపూడి సూర్యనారాయణ రెడ్డి, చెల్లాయమ్మ దంపతులు సమకూర్చారు .దీనిని ఆలయం గాలి గోపురం వద్ద ప్రతిష్ఠించారు. భక్తులు గజేంద్రుని శిల్పం కింద నుంచి దూరితే మోక్షం కలుగుతుందని అర్చకులు చెప్పారు. ప్రతిష్ఠ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజులు, అభిషేకాలు నిర్వహించారు.

సింహ వాహనంపై స్వామివారి గ్రామోత్సవం



సింహ వాహనంపై విహరిస్తున్న స్వామివారు

బిక్కవోలు: మండలంలోని బలభద్రపురం గ్రామంలో ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా తొమ్మిదో రోజు సింహ వాహనంపై స్వామివారి గ్రామోత్సవం జరిగింది. బుధవారం ఉదయం సుప్రభాత సేవ, లఘుఅర్చన, తోమాల సేవ, గ్రంథ పారాయణ, పంచామృతాభిషేకం, గోపూజ. పవళింపు సేవ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారిని సింహ వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లిడి గంగారెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

నూతన పాలకవర్గం ఎన్నిక



ఎన్నికైన నూతన పాలకవర్గ సభ్యులు

రాజానగరం: కరికాల భక్త సేవా సంక్షేమ సంఘం నూతన పాలకవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులు బైరెడ్డి మల్లిబాబు, సొంబత్తుల వీరభద్రరావు, పీతా శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. అధ్యక్షుడిగా గాడి రాజారావు, ఉపాధ్యక్షురాలిగా మోటిపల్లి ఉమామహేశ్వరి, సెక్రటరీగా గాడి శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీగా పాలాటి చిన మల్లికార్జునరావు, కోశాధికారిగా కొక్కిరపాటి వరలక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

సినిమాలు



శ్యామల	: మ్యాక్స్
సూర్యమినీ	: ముఫాసా
సూర్యప్యాలెస్	: యుఐ, క్రావెన్
స్వామి	: ముఫాసా
శివజ్యోతి	: పుష్ప–2
అనుశ్రీ	: మార్కో
రాజా	: పుష్ప–2
ఊర్వశి	: క్రావెన్
మేనక	: బేబీ జాన్
రంభ	: బచ్చలమల్లి
కుమారి	: ముఫాసా
అప్సర	: పుష్ప–2
అశోక	: మార్కో
నామవరం	
వీఎస్ మహల్	: పుష్ప–2 , క్రావెన్
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	: పుష్ప–2
కడియం	
వెంకటసూర్య	: పుష్ప–2, క్రావెన్

నూతన ఏడాదిలో అందరికీ మేలు జరగాలి

- మాజీ ఎంపీ భరత్‌రామ్
- ఘనంగా న్యూ ఇయర్ వేడుకలు



నూతన సంవత్సర వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న మాజీ ఎంపీ భరత్ రామ్



మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజాకు శుభాకాంక్షలు చెబుతున్న డాక్టర్ గూడూరి శ్రీనివాస్ తదితరులు

రాజమహేంద్రవరం సిటీ: నూతన సంవత్సరంలో ప్రజలందరికీ మేలు జరగాలని, కొత్త కాంతులు విరబూయాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్ ఆకాంక్షించారు. వైఎస్సార్ సీపీ సిటీ కార్యాలయంలో బుధవారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. సర్వమత ప్రార్థనల అనంతరం కేక్ కటింగ్ చేశారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు ప్రజలకు మంచి చేయాలని ఆకాంక్షించారు. గడచిన జగనన్న పాలనకు, ఇప్పుడు కూటమి పాలనకు మధ్య ఉన్న తేడాను ప్రజలు గమనిస్తున్నారన్నారు. కూటమి పాలనలో ప్రజల చేతిలో డబ్బులు ఆడటం లేదన్నారు. ఎన్నో హామీలు గుప్పించి, మాయమాటలతో అధికారంలోకి వచ్చిన కూటమికి ఎందుకు ఓటు వేశామా అని ప్రజలు భావిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ తదితర హామీలు నిలబెట్టుకునేలా బుద్ధి ప్రసాదించాలని కోరుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో బీసీ రాష్ట్ర నాయకుడు మార్గాని నాగేశ్వరరావు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

- వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా నివాసంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. పెద్దసంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.
- జగనన్న సారథ్యంలో త్వరలోనే మంచి రోజులు రానున్నాయని వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. తిలక్ రోడ్డులోని పార్లమెంటరీ నియోజకవర్గ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం.. ఏ ఒక్క హామీని పూర్తి స్థాయిలో నెరవేర్చలేదని ఆరోపించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శి గూడూరి రాధిక తదితరులు పాల్గొన్నారు.
- మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు నివాసంలో రౌతు యువసేన ఆధ్వర్యాన నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. వైఎస్సార్ సీపీ శ్రేణులతో పాటు చాంబర్ పాలక వర్గ సభ్యులు, అల్యూమినియం అసోసియేషన్ సభ్యులు, నాయీబ్రాహ్మణ సంఘం, విశ్వ బ్రాహ్మణ సంఘం, వెజిటబుల్ మార్కెట్ సభ్యులు, బొల్లినేని హాస్పిటల్ డైరెక్టర్ తదితరులు విచ్చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. తొలుత వేద పండితులు వేదాశీర్వచనాలు అందించారు.

ఎమ్మెల్యే గోరంట్ల నివాసంలో..

రాజమహేంద్రవరం రూరల్: రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి నివాసంలో న్యూ ఇయర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, టీడీపీ నేతలు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చి, శుభాకాంక్షలు తెలిపారు.

- డీసీసీబీ మాజీ చైర్మన్ ఆకుల వీర్రాజు నివాసంలో వేడుకలు నిర్వహించారు. ఆయనకు పలువురు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.
- ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ చందన నాగేశ్వర్ కార్యాలయంలో కేక్ కట్ చేశారు. ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి, శాలువాలతో ఘనంగా సత్కరించారు.



కేక్ కట్ చేస్తున్న మేడపాటి షర్మిలా రెడ్డి



నూతన సంవత్సర కేక్ కట్ చేస్తున్న రౌతు సూర్యప్రకాశరావు



ఆకుల వీర్రాజుకు శుభాకాంక్షలు చెబుతున్న నాయకులు, కార్యకర్తలు



చందన నాగేశ్వర్‌కు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు చెబుతున్న పార్టీ శ్రేణులు



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే బుచ్చయ్య చౌదరి